చేవెళ్లలో ఎగిరేది గులాబీ జెండే

- రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి తరలిన పార్టీ శ్రేణులు
- అన్ని దారులూ చేవెళ్ల సభకే..
- సభ సక్సెస్‌తో నాయకులు, కార్యకర్తల్లో జోష్

అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

అత్తాపూర్, ఏప్రిల్ 13: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలుపొందడం నల్లేరుమీద నడకేనని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరామ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన చలో చేవెళ్ల భారీ బహిరంగ సభకు అత్తాపూర్ డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అంతకుముందు కార్లు, బైక్‌లు, బస్సుల ద్వారా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అత్తాపూర్‌లో ర్యాలీ ప్రారంభించి వనం శ్రీరామ్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ కంచుకోటగా ఉందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ బలం పుంజుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గండిపేట మండల పరిధి నుంచి..

మణికొండ: గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్, రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్ల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తండోపతండాలుగా బహిరంగ సభకు బయలుదేరారు. ఆయా డివిజన్ల అధ్యక్షులు, బూత్ కమిటీల అధ్యక్షులు, కన్వీనర్లు సభకు నిరాజనం పట్టారు. నాయకులు, కార్యకర్తలు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పని చేయాలన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎనలేని కృషి అందించారని అన్నారు. రాష్ట్రంలో అధిక ఎంపీ సీట్లు సాధించి బీఆర్ఎస్ సత్తాచాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలో ఎక్కడ చూసిన గులాబీ జెండాలు, గులాబీ తోరణాలే కనిపించాయి.

శంషాబాద్ మున్సిపాలిటీ లీగల్ సెల్ అధ్యక్షుడు కొన్నమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేవెళ్ల సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్: చేవెళ్లలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు శంషాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి ఆధ్వర్యంలో 27 గ్రామాల నుంచి వందలాది మంది నాయకులు తరలివెళ్లారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నాయకులు భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, మాజీ సర్పంచ్‌లు దండుఇస్తారి, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాంగోపాల్, రమేశ్‌యాదవ్, పద్మావతి, పట్టేల సతీశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు బుర్కుంట సతీశ్, దవాణాకర్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్, ఎంపీటీసీలు సరిత, గడ్డమీది యాదగిరి, సత్యానందం, మల్లారెడ్డి, నరేశ్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, మల్లికార్జున్, రవీందర్‌నాయక్, ప్రవీణ్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, ఆయా గ్రామాల నేతలు తరలివెళ్లారు.

– శంషాబాద్ మున్సిపాలిటీ నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైనర్మన్ బండి గోపాల్‌యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో 25 వార్డుల కౌన్సిలర్లు చెన్నం అశోక్, అజయ్, ఆయిల్‌కుమార్, జాంగీర్‌ఖాన్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, కొన్నమొల్ల శ్రీనివాస్, మంచర్ల శ్రీనివాస్, దయానంద్, మురళీయాదవ్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

బండ్లగూడ పరిధి నుంచి..

బండ్లగూడ: చేవెళ్లలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సమావేశానికి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, సయ్యద్ ముజముల అహ్మద్, రగడంపల్లి శ్రావణ్, ఎడ్లకాడి సూర్యం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ఆధ్వర్యంలో..

నార్సింగి చౌరస్తా నుంచి బీఆర్ఎస్ సభకు వెళ్తున్న నాయకులు

ఆభరణాలు మాయం.. మహిళ పై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 13: ఉగాది పండుగకు ఇంటికి వచ్చిన సోదరి తన బంగారు ఆభరణాలు తస్కరించిందని మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం. 5లోని దేవరకొండ బస్తీలో డి.రాధ నివాసం ఉంటుంది. ఈనెల 9న జియాగూడలో ఉంటున్న ఆమె సోదరి నరసమ్మ ఉగాది పండుగ కోసం రాధ ఇంటికి వచ్చింది. రాధకు చెందిన రెండు తులాల మంగళసూత్రం, చెవి కమ్మలు తీసుకుని సోమాజిగూడలోని ఓ ఆభరణాల షాపుకు మరమ్మతుల కోసం వెళ్లారు. వాటిని అయితే మేకింగ్ చార్జీలు ఎక్కువగా ఉండడంతో వెనక్కి తీసుకువచ్చారు. ఈనెల 11న తన నరసమ్మ ఇంటికి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన తర్వాత ఆభరణాల కోసం చూడగా కనిపించలేదు. దీంతో తన సోదరి నరసమ్మ వాటిని తస్కరించి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ.. రాధ శనివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 380 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పనులపై సీఎంను కలిసిన కార్పొరేటర్

మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 13: జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్‌లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేక చొరవ చూపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి సీఎంకు సమస్యలను వివరించినట్లు తెలిపారు.

20న మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష

హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 13: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలనే సంకల్పంతో ఈనెల 20న రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరైన అవగాహన కోసం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వారిలో పోటీ పరీక్షల భయాన్ని పోగొట్టి మానసిక స్థైర్యాన్ని పెంచేందుకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ప్రభుత్వ కాలేజీల్లో ఉచితంగా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యార క్రాంతి, నరేశ్ పాల్గొన్నారు.

దానం.. స్థాయి మరిచి మాట్లాడొద్దు

బీఆర్ఎస్ నాయకురాలు తాండ్ర మేఘన

ఖైరతాబాద్, ఏప్రిల్ 13: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని, ఎమ్మెల్యే దానం నాగేందర్ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని ఖైరతాబాద్ బీఆర్ఎస్ నాయకురాలు తాండ్ర మేఘన అన్నారు. 2014లో కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా ఓడిపోయి రాజకీయ నిరుద్యోగిగా నాలుగేండ్ల పాటు ఖాళీగా ఉన్న ఆయనకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది కేసీఆరేనని గుర్తుచేశారు. 2018 ఎన్నికల్లో ఆయన ముఖం చూసి ప్రజలు ఓట్లు వేయలేదని, అప్పటి సీఎం కేసీఆర్, కారు గుర్తును చూసి ఓట్లు వేశారన్న విషయం మరిచిపోవద్దన్నారు. 2023 ఎన్నికల్లోనూ కారు గుర్తుకే ప్రజలు ఓట్లు వేశారని, రెండు సార్లు అవకాశం ఇవ్వకుంటే ఆయన స్థానం ఎక్కడ ఉండేదో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. నిన్న, మొన్న పార్టీ మారి ఇప్పుడు రాజకీయ బిక్షపెట్టిన వారినే విమర్శించే స్థాయి ఎమ్మెల్యే దానంకు లేదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా మిగతా నియోజకవర్గాలకు వెళ్లి ఏదో చేస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఇప్పటికైనా మాటలు వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ఈ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలే బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు.

రాంబాబు సేవలకు అగ్రి అవార్డు

ఖైరతాబాద్, ఏప్రిల్ 13: వ్యవసాయ రంగంలో 27 ఏండ్లుగా విశిష్ట సేవలందిస్తున్న అగ్రి జెనెటిక్స్ లిమిటెడ్ చైర్మన్ రాంబాబు చుండూరి అగ్రి అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం రాత్రి ఓ హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ పీకే సింగ్ చేతుల మీదుగా లీడర్ విత్ స్టాటిక్ విజన్ ఇన్ అగ్రి బీజినెస్ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో నాబార్డు తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల, ఇఫ్కో ప్రతినిధి తరుణ్ భార్గవ, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ గ్లోరి స్వరూప, ఎస్‌బీఐ సీజీఎం రాజీవ్‌కుమార్, రే కన్‌స్ట్రక్షన్ ఎండీ రాజ్ కుమార్‌అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రంగస్థల పద్యనాటకోత్సవాలు

యయాతి నాటక ప్రదర్శనలో సన్నివేశం

బంజారాహిల్స్, ఏప్రిల్ 13: ఫిలింనగర్‌లోని రామానాయుడు కళామండపంలో పొత్తూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ఐదు రోజులుగా కొనసాగిన రంగస్థల పద్య నాటక మహోత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. సుమిత్ర యూత్ అసోసియేషన్‌కు చెందిన కళాకారులు 'యయాతి' పద్య నాటకాన్ని ప్రదర్శించారు. యయాతిగా చిలువేరు శాంతయ్య, వృషపర్వుడిగా డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు, శుక్రాచారుడిగా వసంత్‌కుమార్ నటించారు. తెలుగు సంస్కృతిలో భాగమైన నాటక కళను ప్రోత్సహించడంతో పాటు ప్రతియేటా రంగస్థల నాటకోత్సవాల్లో పాల్గొంటున్న నటీ నటులను నిర్వాహకులు వెంకటసుబ్బారావు ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పబ్బతి శ్రీకృష్ణ రచించి పాడిన 'దళితజాతి భాస్కరా.. అంబేద్కరా' అనే పాటల వీడియోను శనివారం జూబ్లీహిల్స్ జర్నలిస్ట్‌కాలనీలో ప్రజాకవి జయరాజు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పబ్బతి శ్రీకృష్ణతో పాటు డాక్టర్ దాసరి రంగ తదితరులు పాల్గొన్నారు.

– బంజారాహిల్స్

అగ్నిమాపక సిబ్బంది ధైర్యసాహసాలను గుర్తించాలి

ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 13: అగ్నిమాపక సిబ్బంది ధైర్య సాహసాలను ప్రతిఒక్కరూ గుర్తించాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ రవీందర్ అన్నారు. జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నేషనల్ ఫైర్ సర్వీస్ వీక్ పేరుతో వారంరోజుల పాటు అగ్నిప్రమాదాలు, భద్రత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఓయూ వీసీ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాల్లో వర్సిటీ పరిధిలోని అన్ని విద్యాసంస్థలు, విద్యార్థులను భాగస్వాములను చేస్తామని అన్నారు. అగ్నిప్రమాదాలు, వాటి నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. జిల్లా అగ్నిమాపక అధికారి మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి దేశంలోని అన్ని అగ్రిమాపక కేంద్రాల వద్ద నివాళులర్పించనున్నట్లు తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, పార్కులు, పాఠశాలలు, సినిమా థియేటర్లు, ఫంక్షన్ హాళ్లలో మాక్ డ్రిల్ నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎఫ్‌వోలు సురేశ్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ఎస్ఎఫ్‌వో రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతికి భారీగా తరలిరావాలి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 13: రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు పార్టీలకు అతీతంగా నాయకులు తరలిరావాలని ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు రాచమల్ల చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పటాకులు కాలుస్తూ ఇబ్బందులు.. కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 13: అపార్ట్‌మెంట్‌వాసుల భద్రతకు భంగం కలిగించేలా పటాకులు కాలుస్తున్న వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్ నం.3లోని అప్‌టౌన్ బంజారా బిల్డింగ్‌లో పలు షాపులు ఉన్నాయి. వీటితో పాటు పై అంతస్తుల్లో రెసిడెన్షియల్ ఫ్లాట్స్ ఉన్నాయి. కొంతకాలంగా కింది షాపుల నిర్వాహకులు పలుమార్లు పటాకులు కాలుస్తుండడంతో ఫ్లాట్లలోని వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, దీనివల్ల తమ ఆస్తులకు డామేజీ అవుతోందని శ్రవణ్‌కుమార్‌రెడ్డి శనివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్కెచర్స్ షాపు, ఇండియన్ టెర్రయిన్ స్టోర్లలో పటాకులు కాల్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఐపీసీ 427 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

బండ్లగూడ, ఏప్రిల్ 13: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు వివరాల ప్రకారం.. నౌ నంబర్‌కు చెందిన మహ్మద్ చాంద్‌పాషా (25) కూలీ. శుక్రవారం రాత్రి భార్యతో గొడవపడ్డాడు. దీంతో అమె పుట్టింటికి వెళ్లి శనివారం ఇంటికి వచ్చి తలుపులు తట్టగా.. స్పందన లేదు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగలకొట్టి చూడగా చాంద్‌పాషా ఉరేసుకుని కనిపించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియ మార్చురికి తరలించారు. పాషా తల్లి అలియాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముంపు సమస్య రాకుండా..

- సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రీకాస్ట్ స్లాబ్‌లు
- ఈఈ రాజ్‌కుమార్

కమలాపురికాలనీలో సిబ్బందితో పూడికతీత పనులు చేపడుతున్న న్యాక్ ఏఈ వెంకటేశ్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 13: వరద ముంపు సమస్యలు రాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. నాలాలు ఓవర్ ఫ్లో కాకుండా జీహెచ్ఎంసీ అధికారులు పకడ్బందీగా పనులు నిర్వహిస్తున్నారు. ముందు జాగ్రత్తగా వర్షాలు రాకముందే నాలాల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రవాహం నిలిచిపోకుండా పూడికతీతకు అనువుగా ప్రీ కాస్ట్ స్లాబ్‌లు ఏర్పాటు చేసి ముంపు నివారణకు చర్యలు తీసుకుంటునానరు. నాలాల్లో వరద ప్రవాహం నిలిచిపోకుండా ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేస్తున్నారు. వరద ఉధృతిని బట్టి ఆయా ప్రాంతాల్లో అప్పటికప్పుడు నాలా స్లాబ్‌లను తొలగించి యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఈ మేరకు యూసుఫ్‌గూడ కమలాపురి కాలనీలో జీహెచ్ఎంసీ అధికారులు నాలాలపై ప్రీకాస్ట్ స్లాబ్‌లను తొలగించి పూడికతీత పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. నాలాలను పూర్తిగా మూసివేయకుండా ఏర్పాటు చేస్తున్న ప్రీకాస్ట్ స్లాబ్‌లతో పూడికతీత పనులు సుళువవుతాయని ఈఈ రాజ్‌కుమార్ తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో సమస్యాత్మక ప్రాంతాల్లో నాలాలపై ప్రీకాస్ట్ స్లాబ్‌లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కొన్నిచోట్ల పాత స్లాబ్‌లను తొలగించి నాణ్యమైన కొత్త స్లాబులను వేస్తున్నామని ఆయన వెల్లడించారు.

'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' ఏర్పాటు వద్దు

తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి

మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న తల్లుల సంఘం, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 13: మారేడ్‌పల్లి మండల పరిధిలోని పాఠశాల యాజమాన్య కమిటీలు, తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం అడ్డగుట్టలో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటును విరమించి, అలాగే.. విద్యాశాఖ జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీలను పటిష్ట పరుచుటకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి , పాఠశాల యాజమాన్య కమిటీ మండల కన్వీనర్ గోపి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... చట్టం 2009 లోని సెక్షన్ 21, 22 ద్వారా తల్లిదండ్రులకు పాఠశాల నిర్వహణలో భాగస్వామ్యం కల్పించుటకు దేశంలోని ప్రతి పాఠశాలలో పాఠశాల యాజమాన్య సంఘాన్ని ఏర్పరచుట కోసం చట్ట రూపం ఇవ్వడం జరిగిందన్నారు. అయితే.. ప్రస్తుతం ఈ చట్టబద్ధ పాఠశాల యాజమాన్య కమిటీ స్థానంలో పొదుపు ఐక్య సంఘాల అధ్యక్షులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అధ్యక్షులుగా పెట్టి.. పాఠశాల బాలల తల్లిదండ్రులను సభ్యులను చేయడం ద్వారా నిర్ణయాల్లో తల్లిదండ్రుల పాత్ర నిర్వీర్యం అవుతుంది అని అన్నారు. ఇది చట్టాన్ని ఉల్లంఘించడం అవుతుందని అన్నారు. ఇందువల్ల చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా ఏర్పాటు చేయాలనుకున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009లోని సెక్షన్ 21, 22 ప్రకారం పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించి.. వాటిని పటిష్ట పరచాలని కోరారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీ నారాయణ, కౌసల్య, సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ ప్రవీన్, సభ్యులు, శోభ, పుష్ప, పృథ్వీరాజ్, పేరెంట్స్ సుల్తానా బేగం, అనిత, నజీమా, మేరీ, భవాని, ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య, రెమెడియల్‌లతో పాటు టీచర్స్ లావణ్య, సౌజన్య, క్రాంతి రేఖ పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న కార్పొరేటర్ దంపతులు

సీఎం రేవంత్‌రెడ్డితో మహాలక్ష్మి, రామన్‌గౌడ్ దంపతులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 13: హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి ఆమె భర్త జి.రామన్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె బీజేపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచారు. 2023 నవంబర్3న బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అయితే శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సీతారాంరెడ్డి, మహేశ్‌కుమార్, సయ్యద్ జక్కి హుస్సేన్, అక్షిత్‌జైస్వాల్, ఎంబీకే నాయుడు, సాయికుమార్, శ్రీనివాస్‌గౌడ్, అభిషేక్, జగదీశ్ తదితరులు ఉన్నారు.

దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లుగుల్ల

బండ్లగూడ, ఏప్రిల్ 13: దైవదర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లుగుల్ల అయిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. బండ్లగూడ వికాస్‌నగర్‌కాలనీలో నవీన్ అనే వ్యాపారి నివాసం ఉంటున్నాడు. ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి దైవ దర్శనం కోసం వెళ్లాడు. శనివారం తిరిగి ఇంటికి చేరుకోవడంతో ఇంటి తాళం విరిగిపోయి కనిపించింది. దీంతో లోనికి వెళ్లి చూడగా 12 తులాల బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.25వేల నగదు చోరీ అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్స్ బృందాలు రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

అమీర్‌పేట్, ఏప్రిల్ 13: కిరాణా దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 400 కేజీల రేషన్ బియ్యాన్ని బాలానగర్ ఎస్‌వోటీ, సనత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం మోతీనగర్‌లో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్న ఓంప్రకాశ్ నివాసంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెలుగు చూసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఓంప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు.